రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ప్రజల క్యూ..!

- ఫిబ్రవరి ఒకటి నుంచి పెరగనున్న ఆస్తి విలువ
- గత నాలుగు రోజులుగా పెరిగిన రిజిస్ట్రేషన్లు
- రాత్రి 7 గంటల తరువాత కూడా కొనసాగిన రిజిస్ట్రేషన్లు
- తాజా పెంపుతో మరింత పతనమేనంటున్న రియల్టర్లు

కుటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎటువంటి ఫీజులు పెంచమని, పన్నులు పెంచమని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరక ముందే పన్నుల బాదుడుతో పెను భారం మోపుతున్నారు. తాజాగా ఆస్తి విలువలు పెంచి, రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

మాచర్ల రూరల్/పిడుగురాళ్ల : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో భూములు, స్థలాల మార్కెట్ విలువ శనివారం నుంచి భారీగా పెరగనున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చేయించుకునే వారితో గురజాల, మాచర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిక్కిరిసి పోయాయి. ఫిబ్రవరి 1 నుంచి ఆస్తి విలువ పెరగనున్న నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ప్రజలు బారులు తీరారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు డాక్యుమెంట్ రైటర్లు, అమ్మకాలు, కొనుగోలు చేసే వ్యక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం రాత్రి 8 గంటలకు కూడా కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది. శుక్రవారం భారీగా తరలివచ్చి భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.


పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న ప్రజలు

శుక్రవారం అధికంగా...

సాధారణ రోజుల్లో గురజాలలో రోజుకు 20 నుంచి 30 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరగగా గురు, శుక్రవారాల్లో గణనీయంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. గురువారం 74, శుక్రవారం 70 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తెలిపారు.

- సాధారణ రోజుల్లో మాచర్లలో 10 నుంచి 12 వరకు రిజిస్ట్రేషన్లు జరగగా గురువారం 35, శుక్రవారం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయి.
- పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గత నాలుగు రోజులుగా ప్రజలతో బిజీబిజీగా మారింది. సాధారణంగా శుక్రవారం రోజున రిజిస్ట్రేషన్ లావాదేవీలు తక్కువగా జరుగుతాయి.


మాచర్లలో రాత్రి 7 గంటల తరువాత కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

కానీ ఆస్తి విలువ పెంపుతో రిజిస్ట్రేషన్ ఫీజులు భారీగా పెరుగుతాయని శుక్రవారం కూడా రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. శుక్రవారం 40 లావాదేవీలు జరుగగా, గత నాలుగు రోజులలో 200కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి.

10 నుంచి 30 శాతం పెరుగుదల

ఫిబ్రవరి 1 నుంచి పట్టణంలోని అన్ని కేటగిరీ భూములను 10 శాతం, పొలాలకు 30 శాతం పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. మాచర్ల సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 34 గ్రామాలు, పట్టణం ఉండగా యకరా పొలానికి రూ. 2.80 లక్షల నుంచి ఒక్కసారిగా రూ.4 లక్షలకు పైగా, స్థలాలకు గజానికి రూ.500 నుంచి రూ.600 వరకు రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచనున్నారు.

రియల్ ఎస్టేట్ రంగం పతనం

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సరిగా అమ్మకాలు, కొనుగోళ్లు లేక రియల్ ఎస్టేట్ రంగం చతికిలపడింది. అప్పులు చేసి వేసిన వెంచర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అవసరాల నిమిత్తం ఉన్న ఆస్తిని అమ్మకానికి పెట్టినా, కొనే వారు లేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ మధ్యవర్తులు 2, 3 ప్లాట్లు విక్రయించే వారు. ఒక్క ప్లాట్ కూడా విక్రయించలేని పరిస్థితి ఉంది. ఇక రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వరుసగా పత్తి, మిర్చి, కంది, వరి పంట పూర్తిగా దెబ్బతినటం, పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో వ్యవసాయ భూముల రేట్లు పడిపోయాయి. అప్పులు తీర్చుకోవాలన్నా పొలాలు అమ్ముజూపుతున్నా కొనేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

> **నేటి నుంచి పెరిగిన ఆస్తి విలువ ప్రకారం రిజిస్ట్రేషన్లు**
>
> రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో భూములు, స్థలాల ధరలు పెరిగాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి సుమారు 10 నుంచి 20 శాతం ప్రభుత్వ విలువ పెరగనుండడంతో ఆ ప్రకారం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం జరుగుతుంది. శుక్రవారం రిజిస్ట్రేషన్ లావాదేవీలు బాగానే జరిగాయి. ఆస్తి విలువ పెరిగితే రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెరుగుతాయన్న కారణంతో రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగాయి.
>
> – నాగ శైలజ, సబ్ రిజిస్ట్రార్, పిడుగురాళ్ల

క్లుప్తంగా

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అర్జున్‌నాయక్



రెంటచింతల: రెంటచింతల తహసీల్దార్‌గా మూఢావత్ అర్జున్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అర్జున్ నాయక్ ఇప్పటి వరకు బొల్లాపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఈ నెల 24న అర్జున్ నాయక్‌ను పదోన్నతిపై రెంటచింతలకు బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ గురజాల తహసీల్దార్ కె.నగేష్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేశారు. ఈ సందర్భంగా అర్జున్ నాయక్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, ఆర్ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.

అమరవీరులకు నివాళులు



పిడుగురాళ్ల: స్వాతంత్ర్య సమరంలో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారికి నివాళులుగా జాతీయ అమరవీరుల దినోత్సవాని జనవరి 30వ తేదీన జరుపుకోవటం జరుగుతుంది. ఈ సందర్భంగా ఐఎంఏ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ అధ్యక్షుడు దూళ్లిపాళ్ల భరత్‌కుమార్ సమక్షంలో అమరవీరులకు నివాళులర్పించారు. అలాగే కోవిడ్ సమయంలో 2 వేల మంది ఐఎంఏ వైద్యులు 25 వందల మంది నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు, వెయ్యి మంది పోలీసులు 100 మంది కేంద్ర రిజర్వుడ్ పోలీసులు ప్రాణ త్యాగాలు చేశారన్నారు. వారందరికి పిడుగురాళ్ల ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) శాఖ సభ్యులు గురువారం రాత్రి వారి హాస్పటల్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కోవిడ్ అమరవీరులకు ఆత్మశాంతి కలగాలని ఈ సందర్భంగా డాక్టర్ దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, డాక్టర్ బొర్రా శ్రీరాం ప్రసాద్‌లు తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి



పిడుగురాళ్ల: ప్రైవేటు స్కూళ్లలో ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూళ్లు చేయటంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులపై కూడా ఒత్తిడి తీసుకొని వస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటా సాయి, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూరిబా గాంధీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బత్తిన శ్రీరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రతి శుక్రవారం పాఠశాలలోని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సాల్మన్ సింగ్ పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య ఉద్యోగి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించండి

తహసీల్దార్ వి.కిరణ్ కుమార్



మాచర్ల రూరల్: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పనిచేయాలని తహసీల్దార్ వి.కిరణ్ కుమార్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో ఐదు మండల కేంద్రాల్లో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు పరిశీలన పూర్తయిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోలింగ్ స్టేషన్‌ల గురించి వీడియోలతో వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, బీజేపీ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య, బీఎస్పీ జి.సైదులు, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబు, ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్, ఎన్నికల డీటీ రమణ, ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్ఓలు తదితరులున్నారు.

నేడు మహా అన్నదానం

రెంటచింతల : స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల సందర్భంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమ రెడ్డి శుక్రవారం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


రెంటచింతలలోని వాసవీ అమ్మవారు


పిడుగురాళ్లలోని వాసవీ అమ్మవారు

రెంటచింతల: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్టి సత్యనారాయణ శర్మ నేతృత్వంలో ఎస్.శ్రీనివాస శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆర్యవైశ్య పతాకావిష్కరణ చేశారు. 9 గంటలకు 102 మంది కన్యలచే గణపతిపూజ, అభిషేకం, హోమం, కుంకుమ పూజ, ఆర్యవైశ్య దంపతులచే గణపతిపూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర నామపూజ జరిపించారు. సాయంత్రం భగవద్గీత, విష్ణు, లలితా సహస్ర నామ పారాయణలు, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు నాళం చిన బాబు, పల్చూరి శివ రామకృష్ణ, దేవరశెట్టి వెంకట నర్సయ్య, యేచూరి వెంకటేశ్వరరావు, కట్టమూరి ఆంజనేయులు, గుండా రామ్మూర్తి, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాయలంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కారెంపూడిలో...

కారెంపూడి: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మణికంఠ శాస్త్రి ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం, లలితా సహస్ర నామ హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాచర్ల చెన్నకేశవస్వామి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ సూరె ఎలమంద తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



వెల్దుర్తి: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బాషా, ఎంపీడీఓ డి.ప్రసాద్‌ల ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు నిర్వహించేందుకు మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించామన్నారు. ఎన్నికలకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కానుకమాత చర్చి తిరునాళ్ల వేడుకలు


1850లో నిర్మించిన కానుకమాత దేవాలయం


రూ.5 కోట్లతో నూతనీకరించిన కానుకమాత చర్చి

రెంటచింతల: రాష్ట్రంలో రెంటచింతల విషయం ప్రస్తావనకు వస్తే రోళ్లు సైతం పగిలే భగభగమండే ఎండలే గుర్తుకొస్తాయి అందరికి, కానీ ఇక్కడ ప్రేమను వర్షించే ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కానుకమాత దేవాలయం ఉంది. ఆలయంలో అడుగు పెట్టగానే చలువరాయి చల్లదనమే కాదు.. శరణుకోరిన ప్రతి ఒక్కరిపై కానుకమాత కరుణాకటాక్ష వీక్షణాలు ప్రసరిస్తాయి. ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకై యేసు క్రీస్తు శిలువ వేసే సమయంలో పడిన పాట్లను గుర్తుచేసే చర్చిలో ఏర్పాటు చేసిన 14 స్థలాలు భక్తులలో ప్రేమ, శాంతి, కరుణ, సహనం నింపుతాయి. రాష్ట్రంలోనే దాదాపు 5 వేల మంది భక్తులు ఒకేసారి ప్రార్థన చేసుకునే సౌకర్యం ఉన్న అతిపెద్ద చలువరాతి క్రీస్తు దేవాలయం 1982లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ దేవాలయాన్ని ప్రస్తుతం రూ.5 కోట్ల వ్యయంతో నూతనీకరించడంతో ఈ గ్రామంలో కొత్తకాంతులు వెదజల్లుతున్నాయి. ఇంత పెద్ద ఆలయం కేవలం రెండు పిల్లర్ల ఆధారంగా నిర్మించడం ఇక్కడ మరో గొప్ప విశేషం. విచారణ గురువులు రె.ఫాదర్ జోసఫ్ గ్రాండ్, ఫాదర్ కెనడీల ఆధ్వర్యంలో అద్భుతమైన ఆర్కిటెక్ పరిజ్ఞానంతో 1850లో అద్భుతమైన కానుకమాత చర్చిని అత్యంత సుందరంగా నిర్మించారు. కానుకమాత దేవాలయం రాష్ట్రంలోనే ప్రముఖ చర్చిలలో ఒకటిగా పేరుపొందింది. రెంటచింతలలో సుమారు పలు సమాజిక వర్గాలకు చెందిన 1200కి పైగా కుటుంబాల వారు క్రైస్తవాన్ని విశ్వసిస్తూ క్రీస్తును ఆరాధిస్తున్నారు. ఫాదర్ జోసఫ్ గ్రాండ్ నుంచి ప్రస్తుత ఫాదర్ ఏరువ లూర్దుమరెడ్డి వరకు 19 మంది విచారణ గురువులు ఇక్కడ క్రీస్తు బోధనలు చేస్తూ సేవలను అందిస్తున్నారు. ప్రతి ఏటా కానుకమాత దేవాలయంలో జనవరి 24న జెండా ప్రతిష్టతో ప్రారంభమై ఫిబ్రవరి1 వరకు నవ దిన ప్రార్థనలు జరుగుతాయి. ఫిబ్రవరి 2న కానుకమాత తిరునాళ్ల మహోత్సవం కనుల పండువగా జరుగుతుంది.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



వెల్దుర్తి: మండలంలో పంచాయతీ రాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, టైపిస్టు దేరంగుల విజయ్ కుమార్‌లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డి.ప్రసాద్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని వెల్దుర్తి మండలంలో పనిచేస్తూ ఉత్తమ అధికారులుగా ఎంపిక కావటం సంతోషకరమన్నారు. వెనుకబడిన ప్రాంతంలో పనిచేస్తూ అధికారులను, ప్రజా ప్రతినిధులను సమన్వయ పరుస్తూ పనిచేసి ఉత్తమ అధికారులుగా ఎంపికైనందుకు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో పని చేసినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే ఈ అవార్డు అందుకోవటం జరిగిందన్నారు. ఈఓపీఆర్‌డీ మకట్‌లాల్, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

రీ సర్వేపై గ్రామ సభ.. ర్యాలీ



వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో తహసీల్దార్ బాషా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరి పొలాల్లో వారే ఉండే విధంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి సరిహద్దులు నిర్ణయిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని భూమి కలిగిన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవదిన ప్రార్థనలు

రెంటచింతల: కరుణామయురాలు కానుకమాత అని రెవ.ఫాదర్ వినయ్(వి.సి) అన్నారు. స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పునీత ఆరోగ్యనాథుని మందిరం వద్ద నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన పవిత్ర సమష్టి దివ్య పూజాబలిలో ఫాదర్ వినయ్ భక్తులను ఈ సమిష్టి దివ్య పూజాబలిలో సహాయ గురువులు అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవాంబ ఆత్మార్పణ దినోత్సవం

మాచర్ల: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల శ్రేయస్సు కోరి అగ్నిగుండ ప్రవేశం చేసిన రోజును ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించటం జరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు పార్వతి దేవి అంశగా చెబుతారన్నారు. అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుల సహకారంతో ఆలయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆలయ అర్చకులు బత్తినపాటి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ కుసుమ శ్రేష్టి, కుసుమాంబలకు జన్మించిన వాసమాంబను విష్ణువర్ధన మహారాజు వివాహం చేసుకుంటానని తెలపగా.. తాను పార్వతిదేవి అంశనని శివుని ఆరాధించుటకే జన్మించానని తెలిపి.. ఆత్మార్పణ చేసుకోవటం జరిగిందని చరిత్ర చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంభంపాటి అనిల్ కుమార్, కజ్జం సైదయ్య, యలమంద, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, గోల్ల జనార్ధన, రంగా జనార్ధన, కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, చిన్ని చంద్రం, భవనాశి రవితేజ, కొత్తమాసు చెన్న, మేడా వెంకట లక్ష్మి, ఆదిలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, తుమ్మేపల్లి అంకారావు, సత్యం, రంగా జానకి, భక్తులు తదితరులున్నారు. అమ్మవారికి పలువురు కన్యలచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే జేబీఆర్, కమిటీ సభ్యులు

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు యేలూరి శశికుమార్



రెంటచింతల: గ్రామాలలో బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యేలూరి శశికుమార్ అన్నారు. శుక్రవారం రెంటచింతలకు చెందిన ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి, గాదె సైదారెడ్డి, జి.మల్లికార్జునరావు, వి.థామస్‌రెడ్డితో పాటు వివిధ సామాజిక వర్గాలకు చెందిన 50 మంది బీజేపీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. క్రమశిక్షణ కలిగిన బీజేపీలో అంకితభావంతో ముందుకు పోవాలన్నారు. ముందుగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల కన్వీనర్ నాసరయ్య, పార్టీ సీనియర్ నాయకులు పాశం మట్టారెడ్డి ఎస్.పుల్లారెడ్డి తదితరులున్నారు.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అన్నదానం

గురజాల : అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం మహా పుణ్య కార్యం. గత కొద్ది నెలలుగా నగర పంచాయతీలోని జంగమహేశ్వపురంలో వేంచేసియున్న పల్నాటి భద్రాద్రి అయిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమంను దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అన్నదానానికి విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు. ప్రతి వారం అన్నదానానికి సుమారు రూ.14వేలు ఖర్చు అవుతుందని, 500 నుంచి 700 మంది వరకు అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారని దాతలు సహాయ సహకారాలు అందించాలని కమిటీ నిర్వాహకులు

వలసబాట పట్టిన ఆవులు


వెల్దుర్తి, మాచర్ల మండలాల నుంచి వలస వెళ్తున్న ఆవులు

మాచర్ల రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో పశుగ్రాసం కొరత అప్పుడే ఏర్పడుతుండటంతో ఆవులు మేత కోసం వలస బాట పట్టాయి. శుక్రవారం వెల్దుర్తి, మాచర్ల మండలాల్లోని కొత్తపుల్లారెడ్డి గూడెం, శ్రీరామపురం తండా, అచ్చమ్మకుంట, లచ్చమ్మబావి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పశుగ్రాసం కొరకు డెల్టా ప్రాంతాలైన తెనాలి, పొన్నూరు, గుంటూరు రూరల్ పరిధిలోని గ్రామాలకు ఆవులను తీసుకెళ్తున్నట్లు పశువుల కాపరులు, రైతులు 'సాక్షి' కి తెలిపారు.

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ అమ్మవారు

ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల: ఆర్యవైశ్యులకు ఆరాధ్య దైవం వాసవీ అమ్మవారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవీ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసవీ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వ పరంగా నిర్వహించటం ఆనందించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.